క్లుప్తంగా

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



చారకొండ: నర్సరీలలో మొక్కల పెంపకంపై నర్సరీల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని జూపల్లిలో సోమవారం ఆమె నర్సరీ పనులను పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకానికి విత్తనాలను నాటేందుకు సిద్ధగా ఉన్న బ్యాగులలో నాణ్యమైన మట్టిని నింపాలని, వాటి నిర్వహణ, పెంపకంపై పలు సూచనలు ఇచ్చారు. వారి వెంట ఎఫ్ఎ లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు.

బీఎస్పీతోనే సమన్యాయం

సాక్షి, నెట్‌వర్క్: బీఎస్పీతోనే అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం చేకూరుతుందని నాగర్‌కర్నూల్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్ అన్నారు. సోమవారం తెలకపల్లి మండలంలోని జమిస్తాపూర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా తాడూరు మండల కేంద్రంలోని మిరపతోటతో ప్రచారం చేశారు.

మురుగుకాల్వ నిర్మించండి



తాడూరు: మండల కేంద్రంలోని దళితవాడలో మురుగుకాల్వ నిర్మించాలని ఆకాలనీ ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని అనుసరించుకొని మురుగు ప్రవహిస్తోంది. దీంతో మురుగు ముందుకు వెళ్లలేక ఒకేచోటు పేరుకుపోవడంతో దుర్గంధ వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రెయినేజీ నిర్మాణాలను చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అభ్యర్థుల దిష్టిబొమ్మలు దహనం

మన్ననూర్/బల్మూరు: అచ్చంపేట పట్టణంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణ గ్రామాలలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మన్ననూర్, వటువర్లపల్లి, తుర్కపల్లి తదితర గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు అచ్చంపేట అసెంబ్లీ బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు గువ్వల బాల్‌రాజ్, వంశీకృష్ణల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అదేవిధంగా బల్మూరు మండల కేంద్రంతో పాటు, బాణాల, పోలిశెట్టిపల్లి, కొండనాగుల తదితర గ్రామాల్లో అభ్యర్థుల దిష్టిబొమ్మలు దహనం చేసిన నిరసన తెలిపారు.

పోటాపోటీగా ప్రచారాలు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో సోమవారం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా పోటాపోటీగా ప్రచారం చేస్తూ ఓటర్లను వేడుకుంటున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

చారకొండ: మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయసుధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే, ఎంపీ హాజరవుతారని పేర్కొన్నారు.

వేరుశనగ సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



లింగాల: మండలంలో యాసంగిలో సాగు చేసిన వేరుశనగ పంట సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఓ నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. సోమవారం మండల శివారులో యాసంగిలో సాగు చేసిన వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం పంటకు లద్దె పురుగు ఆశించి నష్టం కలిగిస్తుందని దీని నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ అనే మందును ఎకరాకు 100 గ్రాములు పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

ప్రవక్త జీవిత చరిత్రపై టాలెంట్ టెస్ట్

కందనూలు: జిల్లా కేంద్రంలోని మేరేజ్ మస్జీద్, యాసీన్ ప్లాజా వద్ద సీరతున్నబీ (మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర)పై సీరతున్నబీ ఆర్గనైజేషన్, మసీద్ మేరేజ్ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా 15 సంవత్సరాలలోపు ఒక గ్రూప్‌గా, 16 నుంచి 20 సంవత్సరాలలోపు విద్యార్థులను రెండో గ్రూపులుగా విభజించి పరీక్షలు నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి 500 మందికిపైగా విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

ఘనంగా దీపావళి సంబరాలు



బిజినేపల్లిలో..



లింగాలలో



అచ్చంపేటలో మహిళలు టపాసులు కాల్చుతూ..



కోడేరులో..



ఈగలపెంటలో దీపాలు వెలిగిస్తున్న యువతి



చారకొండలో

జిల్లా వ్యాప్తంగా దీపావళి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. అమావాస్య పురస్కరించుకొని ఉదయం భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇళ్లను పచ్చని తోరణాలు, పూలతో అలంకరించారు. సోమవారం కూడా కేదారేశ్వర గౌరీ నోములు, వ్రతాలు చేపట్టారు. ఇళ్లు, ఆలయాల్లో ప్రమిదలను వరుస క్రమంలో ఉంచి దీపాలు వెలిగించారు. కుటుంబ సమేతంగా టపాసులు కాల్చారు. ఆకాశం టపాసుల వెలుగులతో జిగేల్‌మన్నది. చిన్నారులు కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాడూరులో..



తెలకపల్లిలో



వెల్దండలో


అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా



కోడేరు మండలం నార్యనాయక్ తండాలో మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి/కోడేరు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కొల్లాపూర్ ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్యేని సుధాకర్‌రావు అన్నారు. సోమవారం కోడేరు మండల పరిధిలోని మైలారం, ఎర్రన్న బావితండా, నార్యనాయక్ తండాలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాములలో ఎల్లేనికి మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన సోమశిల గ్రామానికి చెందిన సందు రమేష్‌కు కొల్లాపూర్ పార్టీ కార్యాలయంలో ఎల్లేని నియామాకపు పత్రాన్ని అందజేశారు. కొల్లాపూర్ మండలం చుక్కాయిపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు, పట్టణంలోని పలు వార్డులకు చెందిన యువకులు బీజేపీలో చేరారు.

ఇచ్చిన హామీలపై నిలదీయండి



బిజినేపల్లిలో కూచుకుళ్లకు గజమాలతో స్వాగతిస్తున్న వెల్గొండ గ్రామస్తులు

బిజినేపల్లి/తెలకపల్లి/కందనూలు: బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదో ఎమ్మెల్యేను నిలదీయాలని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని వట్టెం, వెల్గొండ గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్రలో ఆయన పాల్గొన్నారు. తెలకపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి మాట్లాడారు. గ్రామాల్లో కాంగ్రెస్‌కు రైతులు, నిరుద్యోగులు, మహిళలు, యువత బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజేష్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో మల్లు రవి, తెలకపల్లిలో కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు.

ఇంటింటి ప్రచారం

సాక్షి, నెట్‌వర్క్: కొల్లాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జూపల్లి కృష్ణారావుకు మద్దతుగా కొల్లాపూర్ పట్టణంలోని పలు వార్డుల్లో, పెంట్లవెల్లి మండలంలోని మల్లేశ్వరం, ఎంగంపల్లి తండా, మాధవస్వామినగర్ గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమం



ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బోయలపల్లి గ్రామస్తులు

సాక్షి, నెట్‌వర్క్: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఎస్పీ మున్సిపల్ అధ్యక్షుడు పసుపుల పరశురాం, బోయలపల్లె, మొలచింతలపల్లి గ్రామస్తులతో పాటు పట్టణంలోని 7వ వార్డుకు చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలం కరోనాతో పోరాడామని, మిగిలిన మూడేళ్ల కాలంలో తనకు చేతనైనంత వరకు అభివృద్ధి పనులు చేశానని వివరించారు. బోయలపల్లిని గ్రామ పంచాయతీగా చేయించానని, వచ్చేసారి అక్కడ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. వీపనగండ్ల మండల కేంద్రంలో జరగనున్న దీపావళి, గంగమ్మ జాతర సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సతీమణి బీరం విజయమ్మ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోడేరు మండలంలోని తీగలపల్లిలో వీరభద్రస్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు పూజలు చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు.

సింగోటం ఆలయం వరకు పాదయాత్ర..

కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని హర్షన్న యువసేన నియోజకవర్గ అధ్యక్షుడు రంగాపురం శివారెడ్డి ఆధ్వర్యంలో పాన్‌గల్ పెద్దమ్మ గుడి నుంచి సింగోటం లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. శాగాపూర్ సర్పంచ్ మాణికయాదవ్, కేతేపల్లి సింగిల్ విండో డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, తిరుపతియాదవ్, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మౌలాలి మద్దతు తెలిపారు. ఎమ్మెల్యేకు మద్దతుగా రంగినేని అభిలాష్‌రావు పాన్‌గల్ మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, శాగాపూర్‌తండాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో వీపనగండ్ల ఎంపీపీ కమలేశ్వర్‌రావు, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, ముంత మల్లయ్య యాదవ్, మౌలాన్‌బీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్ నాయక్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యానాయుడు, రఘుపతినాయుడు, జ్యోతి నందన్‌రెడ్డి, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలి



అచ్చంపేటలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



చారకొండలో..

అచ్చంపేట రూరల్: ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని ఏఎస్పీ రామేశ్వర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారిగుండా సాయుధ బలగాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. శాంతియుత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున 144 సెక్షన్, సీఆర్‌పీసీ సెక్షన్ అమలులో ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణకిషోర్, సీఐలు అనుదీప్, ఆదిరెడ్డి, ప్రదీప్, నర్సింహులు, ఎస్ఐలు గోవర్దన్, గురుస్వామి, శేఖర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, 120 మంది పాల్గొన్నారు.

చారకొండ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల అదుపునకు పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి అన్నారు. మండల కేంద్రంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లో డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. సీఐలు సోమనర్సయ్య, అంజనేయులు, ఎస్‌లు రవి, శ్రీనివాస్, కురుమూర్తి, రమేష్ ఉన్నారు.

మాల మహానాడు నాయకుల నిరసన

అచ్చంపేట రూరల్: ఎస్సీ వర్గీకరణకు ప్రధాని నరేంద్రమోదీ మద్దతు తెలపడంపై మాల మహానాడు నాయకుల నిరసన తెలిపారు. ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రధాని హోదాలో దండోరా బహిరంగ సభకు రావడం రాజ్యాంగ విరుద్ధమని, రాగద్వేషాలకు అతీతంగా ఉండాల్సింది పోయి ఎస్సీలను విభజించడానికి రావడం సరైంది కాదన్నారు. బీజేపీ భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్, ఆనంద్, వెంకటస్వామి, రఘుపతి, పర్వతాలు, వెంకటయ్య, దశరథం తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: మరోసారి ఓటు వేసి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలో 15వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గడపకు ఏదో రూపంలో సంక్షేమ పథకం అందిందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ అండగా ఉండాలని కోరారు. జిల్లా కేంద్రంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం ఏర్పాటు చేశామని, ప్రతి వార్డులో సీసీ రోడ్లు నిర్మించామని ఇంటింటికి తాగునీరు అందిస్తున్నామన్నారు. అదేవిధంగా రూ.2 కోట్ల నిధులతో డిజిటల్ లైబ్రరీ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్, వెజిటేబుల్ మార్కెట్లను నిర్మాణం పూర్తయిందని త్వరలో వాటిని ప్రారంభిస్తామన్నారు. కేసరి సముద్రం చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్ది రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చామన్నారు. రోడ్ల విస్తరణ చేసి రూపురేఖలు మార్చామన్నారు. సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఆకట్టుకుంటున్న ఓటరు సెల్ఫీ పాయింట్

అచ్చంపేట రూరల్: పట్టణ ఎన్నికల రిటర్నింగ్(ఆర్డీఓ) కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ కార్యాలయం గేటు ఎదుట స్వీప్ కార్యక్రమంలో భాగంగా సెల్ఫీ పాయింట్‌ను ఆదివారం ఆర్ఓ గోపిరాం ప్రారంభించారు. 'నేను ఓటు వేస్తా.. ఓటరుగా గర్వపడుతున్నా' అనే నినదిస్తూ చూపుడు వేలిని చూపిస్తూ సెల్ఫీలు దిగుతూ సంబరపడుతున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శైలేంద్రకుమార్, నాయబ్ తహసీల్దార్లు రాములు నాయక్, అశోక్, సిబ్బంది అనీల్, వసీం తదితరులు పాల్గొన్నారు.



సెల్ఫీపాయింట్‌ను ప్రారంభిస్తున్న ఆర్ఓ గోపిరాం

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో ఏర్పాటు చేసిన వాహనాల తనిఖీ కేంద్రం వద్ద ముమ్మరంగా అధికారులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి కల్వకుర్తి మీదుగా వచ్చే వాహనాలను నిలిపి తనిఖీ చేస్తున్నామని అధికారి శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ దగ్గర ఏర్పాటు చేసిన చెక్ పాయింట్‌ను జిల్లా స్థాయి అధికారుల సూచనలు, సలహాల మేరకు వారం రోజుల కిందట మేడిపూర్ దగ్గర ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజు 50 పైగా వాహనాలను నిలిపి తనిఖీ అనంతరం వాహనాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నామన్నారు.

సారా పట్టివేత: కేసు నమోదు


ఉప్పునుంతల: మండలంలోని గుట్టమీది తండాకు చెందిన నేనావత్ లక్ష్మన్ సోమవారం సారా తరలిస్తూ తండా స్టేజీ వద్ద పోలీసులకు పట్టుబడినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. అతని వద్ద నుంచి ఎనిమిది లీటర్ల సారాను స్వాధీనం చేసుకొన్నామని పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని పలు వార్డుల్లో బీజేపీ అభ్యర్థి ఆచారికి మద్దతుగా సోమవారం ఆ పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల సమస్యలపై 40 సంవత్సరాలుగా రాజీలేని పోరాటం చేస్తున్న ఆచారికి ఒక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. అంతకుముందు సుభాష్‌నగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు నర్సింహా, దుర్గాప్రసాద్, రాఘవేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, వివకానంద్ తదితరులతో పాటు పలువురు ఉన్నారు.

కారు బోల్తా: వ్యక్తికి గాయాలు



నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు కారుబోల్తాపడి వ్యక్తికి స్వల్పగాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గగ్గలపల్లి గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు వైపు కారులో వెళ్తుండగా ప్రమాదవశాత్తు కారు బోల్తాపడింది. ఈ ఘటనలో ఈశ్వర్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆయనను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

వెల్దండ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెద్దాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్రపుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

మూడోసారి ఆశీర్వదించండి



అమ్రాబాద్/దోమలపెంట: అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం మండలంలోని కుమ్మరోనిపల్లి, ఈదులబావి, అమ్రాబాద్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి వస్తున్న స్పందన జీర్ణించుకోలేక కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. కుమ్మరోనిపల్లిలో ప్రచార రథంపై ఎమ్మెల్యే మాట్లాడుతుండగా గ్రామానికి చెందిన వ్యక్తి రాయి విసరడంతో కార్యకర్తలు అప్రమత్తమై అతనిని పట్టుకొనగా మతిస్థిమితంలేని వ్యక్తిగా గుర్తించి వదిలేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గువ్వల అమల, రవీందర్‌రెడ్డి, సర్పంచ్ శారద తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని ఎడమ పాతాళగంగ వద్ద శివాలయంలో బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల శేఖర్ యాదవ్, ప్రసాద్, అంజి పూజలు చేశారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేటలో బెల్ట్ దుకాణాలపై సోమవారం దాడి చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. గ్రామానికి చెందిన రమేష్ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో బెల్ట్‌షాపుపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కల్వకుర్తిరూరల్: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని కురుమిద్దెలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోశయ్యకు సంబంధించిన ఎద్దు పంట పొలాల్లో మేతమేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతంతో ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. మాజీ ఉప సర్పంచ్ విజయభాస్కర్ బాధిత రైతు పోశయ్యకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సానుభూతి కోసమే డ్రామా

ఉప్పునుంతల: సానుభూతి కోసమే తనపై దాడి జరిగినట్లు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు డ్రామా ఆడుతున్నాడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేకు ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు. కార్యక్రమంలో తిప్పర్తి నర్సింహ్మారెడ్డి, రేణయ్య, రంగారెడ్డి ఉన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ దాడులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఎమ్మెల్యేపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు.